సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ. 31 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.31 వేలు, కనిష్ఠం రూ.15 వేలు, సరాసరి ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.9

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ఠ ధర రూ.9, కనిష్ఠం రూ.3, సరాసరి రూ.5.50 ప్రకారం పలికాయి.

గరిష్ఠం/కనిష్ఠం
39.3°/21.1°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా ఉంది. గాలి వేగం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది.



తలుపు తట్టిన ఆనందం

మాట ఇస్తే వెనక్కు తగ్గేది లేదు.. హామీ ఇచ్చాడంటే నెరవేర్చి తీరతాడు...ఇదీ జగన్‌మోహన్‌రెడ్డిపై జనానికున్న నమ్మకం. ఇచ్చిన మాట మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాదిమందికి వైఎస్సార్ పెన్షన్ కానుక ఇచ్చారు. ఏడాదికోసారి పెన్షన్ మొత్తం పెంచుతున్నారు. ప్రతినెలా ఒకటో తేదీ ఇంటివద్దకే వలంటీర్లు నగదు తీసుకువచ్చి ఇస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారు ఇలా ఒకరేమిటి లక్షలాదిమందికి పెన్షన్ కానుక భరోసా ఇచ్చింది. వృద్ధులైన తల్లిదండ్రులకు అన్నం పెట్టకుండా కొంతమంది సంతానం నిర్లక్ష్యం చేస్తే జగన్ ఇస్తున్న పెన్షనే వారికి జీవనాధారం అయ్యింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకు రూ.140 కోట్ల మేర పెన్షన్ కానుక కోసం ఖర్చు చేస్తున్నారు.

సంబరమనిపింఛన్

- ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే పింఛన్లకు భారీగా వ్యయం చేసిన జగన్ సర్కార్
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5.41 లక్షల మందికి లబ్ధి
- నెలకు రూ.140 కోట్ల లెక్కన ఖర్చు చేసిన పరిస్థితి
- లక్షలాది కుటుంబాల జీవన ప్రమాణాలపై సానుకూల ప్రభావం చూపిన పెన్షన్ కానుక



సాక్షి ప్రతినిధి, అనంతపురం: లక్షలాది కుటుంబాల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక అసాధారణ సానుకూల మార్పులను తీసుకొచ్చింది. వృద్ధాప్యంలో కుటుంబానికి భారంగా కాకుండా ఈ పెన్షన్ ఊరటనిస్తోంది. మేము మీకు భారం కాదు.. మా బిడ్డ మాకు నెలనెలా వేతనం ఇస్తున్నారు.. ఈ డబ్బుతో మేము బతుకుతున్నాం.. అన్న భరోసా చాలామంది వృద్ధుల్లో కనిపిస్తోంది. చాలామంది భర్తను కోల్పోయిన వాళ్లు, మంచానికే పరిమితమైన వాళ్లు కూడా పెన్షన్ కానుకతో మెరుగైన జీవితం గడుపుతున్నారు. ఒక్క ఏడాదిలోనే శ్రీసత్యసాయి జిల్లాలో రూ.823.41 కోట్లు, అనంతపురం జిల్లాలో రూ.857.963 కోట్లు వ్యయం చేశారంటే ఏ స్థాయిలో పెన్షన్ కానుక ఆదుకుందో అంచనా వేయొచ్చు. ఇటీవలే ముఖ్యమంత్రి ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ 2024 జనవరిలో పెన్షన్ కానుక కింద ఇచ్చే మొత్తాన్ని పెంచి ఎన్నికలకు వెళతామని చెప్పడంతో వారిలో మరింత భరోసా వచ్చింది.

జగన్‌కు రుణపడి ఉంటాం



ప్రభుత్వం ప్రతి నెలా అందించే వితంతువు పెన్షన్ తోనే జీవనం సాగిస్తున్నాను. భర్తను కోల్పోయిన నాకు అదే ఆదరువైంది. ఒకటోతేదీ తెల్లారకముందే వలంటర్ తలుపు తట్టి రూ.2,750 చేతిలో పెట్టేస్తారు. ఈ సహాయం నాలాంటి వారికి ఎంతో ప్రయోజనకరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– షహనాబాను, వితంతువు, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

పింఛనుతోనే బతుకుతున్నా..



నాకు ఇద్దరు కూతుళ్లు. వాళ్లకు పెళ్లి చేసి పంపించాను. కొడుకు చనిపోయాడు. నా భర్త పెన్నప్ప కూడా చనిపోయినాడు. ఒక్కదాన్నే ఉంటున్నాను. నాకు జగన్ బాబు నెల నెలా ఇచ్చే వృద్ధాప్య పింఛను రూ.2,750తోనే బతుకు వెళ్లదీస్తున్నా. ఎవరూ లేని వారికి జగన్ బాబే దిక్కు.

– వన్నూరమ్మ, హులికల్లు, కళ్యాణదుర్గం మండలం

శ్రీసత్యసాయి జిల్లాలో పెన్షన్ కానుక..

నెల	లబ్ధిదారులు	వ్యయం (రూ.కోట్లలో)
2022 ఏప్రిల్	2,53,468	64.97
2022 మే	2,53,346	64.90
2022 జూన్	2,52,162	64.59
2022 జులై	2,61,638	67.06
2022 ఆగస్ట్	2,61,376	67.01
2022 సెప్టెంబర్	2,60,495	66.79
2022 అక్టోబర్	2,59,656	66.58
2022 నవంబర్	2,58,790	66.36
2022 డిసెంబర్	2,67,156	74.09
2023 జనవరి	2,66,045	73.82
2023 ఫిబ్రవరి	2,65,194	73.62
2023 మార్చి	2,65,194	73.62

అనంతపురం జిల్లాలో పెన్షన్ కానుక..

నెల	లబ్ధిదారులు	వ్యయం (రూ.కోట్లలో)
2022 ఏప్రిల్	2,63,287	68.050
2022 మే	2,55,631	65.610
2022 జూన్	2,55,025	65.460
2022 జులై	2,65,708	68.260
2022 ఆగస్ట్	2,72,474	70.460
2022 సెప్టెంబర్	2,71,729	70.270
2022 అక్టోబర్	2,70,705	70.020
2022 నవంబర్	2,69,952	69.830
2022 డిసెంబర్	2,79,309	77.970
2023 జనవరి	2,77,367	77.447
2023 ఫిబ్రవరి	2,76,640	77.283
2023 మార్చి	2,76,640	77.283

పింఛనే నాకు ఆధారం



జగన్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వికలాంగ పింఛన్ రూ.3వేలు అందుతోంది. మందులు, ఇతర అవసరాలకు ఈ డబ్బు వాడుకుంటున్నా. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ అందజేసి వెళ్తన్నాడు. సంతోషంగా జీవిస్తున్నాను. పెన్షన్ కానుక అభాగ్యులకు ఎంతోమేలు చేకూరుస్తోంది.

– అహమ్మద్, పెదపల్లి

గౌరవంగా బతుకుతున్నాం



ప్రతినెలా ఒకటో తేదీనే ప్రభుత్వం రూ.2,750 అందజేస్తుండడంతో గ్రామంలో నేను గౌరవంగా బతుకుతున్నా. పొదుపు సంఘంలో కంతులు చెల్లించడం, నిత్యావసరాలకు పింఛన్ మొత్తం వినియోగించుకుంటున్నా. ఇంత పెద్ద మొత్తంలో పింఛన్ అందించే ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. కలకాలం వైఎస్ జగన్ సీఎంగా ఉంటే మా వారికి ఎలాంటి లోటు ఉండదు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణం చేస్తారనేది ముమ్మాటికీ నిజం అవుతుంది.

– నాగలక్ష్మి, వెంగళమ్మచెరువు

చాలా సంతోషంగా ఉంది



నా భర్త చనిపోయాడు. ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో వైఎస్సార్ పింఛన్ కానుకతో జగన్ ప్రభుత్వం ఆదుకుంది. సిఫార్సు లేకుండానే వలంటీర్ సహకారంతో పింఛన్ మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది. ఒకటో తేదీనే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్నారు.

– సావిత్రమ్మ, గోకులం, పుట్టపర్తి

ఎప్పటికప్పుడు అర్హుల గుర్తింపు



ఈ నెలలో అర్హులను గుర్తించి వదిలేయడం కాదు. ప్రతి నెలా అర్హులను గుర్తించి సంతృప్తస్థాయిలో వారికి పెన్షన్ అందిస్తున్నాం. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్ కానుక అందాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు కొత్త లబ్ధిదారులను గుర్తిస్తూనే ఉన్నాం. వారికి నెల నెలా ఒకటో తేదీన పెన్షన్ ఇస్తున్నాం.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీప

న్యూస్‌రీల్

'సాక్షి'పై తమ్ముళ్ల అక్కసు

- బండారం బయటపడుతుందని పత్రిక బండిళ్లు ఎత్తుకెళ్లిన వైనం

చెన్నేకొత్తపల్లి: వాస్తవాలను ప్రజలకు చేరవేస్తున్న 'సాక్షి'ని చూసి తెలుగు తమ్ముళ్లు జడుసుకుంటున్నారు. జనం 'సాక్షి' పేపర్‌ను చదవకుండా చూసేందుకు ఏకంగా పేపర్ బండిళ్లనే ఎత్తుకుపోయారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.... మాజీ మంత్రి పరిటాల సునీత చేసిన భూ దందాలపై రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గురువారం ఆధారాలతో సహా విలేకరులకు వివరించారు. ఆ వివరాలను శుక్రవారం 'సాక్షి' ప్రముఖంగా ప్రచురించింది. లోకేష్ పాదయాత్ర జరుగుతున్న నేపథ్యంలో తమ నాయకురాలి కుటుంబం పరువుపోతుందని భావించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కొందరు శుక్రవారం తెల్లవారుజామున కారులో వచ్చి ఎన్ఎస్ గేట్, చెన్నేకొత్తపల్లి గ్రామాలకు వెళ్లాల్సిన 'సాక్షి' పత్రిక బండిళ్లను ఎత్తికెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




పెనుకొండ: నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు రామగిరి స్కిల్ కళాశాలలో వివిధ కోర్సులు ప్రవేశపెట్టినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం, జాబ్స్ కోఆర్డినేటర్ లక్ష్మి శుక్రవారం తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, 'సీడాప్' సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కళాశాలలో వీఎంఎస్, డిజైన్ ఇంజనీర్, ఆటోమోటివ్ టూల్ రూం లెడ్ టెక్నీషియన్, ఎలక్ట్రిక్ వెహికల్ టెస్ట్ ఇంజనీర్ కోర్సులు ఇప్పటికే ప్రారంభించామన్నారు. డిప్లొమా, బీటెక్, ఐటీఐ(మెకానికల్) కోర్సులు చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు7989479371 నంబరులో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు.

రేపు జిల్లాకు రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్

హిందూపురం టౌన్: రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఈనెల 2వ తేదీన జిల్లాకు రానున్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం హిందూపురం వస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. పట్టణ, మండలంలో పీడీఎస్, ఎండీఎం, ఐసీడీఎస్, పీఎంఎంవీవై తదితర సంక్షేమ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఆహార కమిషన్ చైర్మన్ తనిఖీలు నిర్వహిస్తారన్నారు.

ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

- ఎంజేపీ విద్యార్థి మహిత మృతిపై ఉన్నతాధికారుల చర్యలు



చిలమత్తూరు: టేకులోడు క్రాస్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల 8వ తరగతి విద్యార్థిని మహిత మృతి ఘటనపై అధికారులు చర్యలు తీసుకున్నారు. 20 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మహితను బుధవారం రాత్రి అనంతపురం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి మృతి ఘటనపై విచారణ జరిపిన అధికారులు టీజీటీ కోమలాదేవి, స్టాఫ్ నర్స్ పద్మావతి నిర్లక్ష్యం ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు ఇరువురినీ సస్పెండ్ చేస్తూ ఎంజేపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు మహిత మృతి ఘటనపై కలెక్టర్ బసంత్‌కుమార్ కూడా స్పందించారు. పూర్తి స్థాయిలో విచారణ జరపాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌ను ఆదేశించారు. దీంతో సబ్‌కలెక్టర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులను మందలించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల పూర్తి బాధ్యత ఉపాధ్యాయులు, వార్డెన్‌దేనని ఆయన స్పష్టం చేశారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

- కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ

పుట్టపర్తి అర్బన్: జీవితాలను ఛిన్నాభిన్నం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పిలుపునిచ్చారు. కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ కన్వీనర్‌గా, పెనుకొండ సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, జిల్లా విద్యాశాఖ అధికారి, డీఎంహెచ్‌ఓ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కమిటీ సభ్యులుగా ఏర్పాటైన మాదకద్రవ్యాల నియంత్రణ సమన్వయ కమిటీ తొలిసారి శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా మాదక ద్రవ్యాల వినియోగం లేకుండా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ కార్యకలాపాలపై ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 14500 గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. మండల, డివిజన్ స్థాయి అధికారులతో పాటు వార్డు మెంబర్లు, గ్రామ సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

గంజాయి విక్రయాలపై నిఘా..

ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో గంజాయి ఉత్పత్తి జరగలేదని, కొందరు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి ఇక్కడ విక్రయాలు చేశారన్నారు. ఇప్పటికే అలాంటి వారిని అరెస్టు చేశామన్నారు. గంజాయి విక్రయదారులపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామన్నారు. అలాగే బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, యూనివర్సిటీల వద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం చేస్తామన్నారు. ఇప్పటి వరకూ జిల్లా పరిధిలో 36 కిలో గంజాయి సీజ్ చేసినట్లు వివరించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ డ్రగ్స్ నిరోధానికి తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సీఐలు సుబ్బారావు, బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, కలెక్టరేట్ తహసీల్దార్ అనుపమ, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, డీఈఓ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రశాంతి నిలయం: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. శుక్రవారం ఆమె కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా, 424 పాఠశాలలకు చెందిన 25,881 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇందులో 22,385 మంది రెగ్యులర్, 3,496 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారన్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 125 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు డిపార్ట్‌మెంటల్ అధికారులను, ఇన్విజిలేటర్ల నియామకం కూడా ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తాగునీరు, కరెంట్, ఫర్నీచర్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. అలాగే మాస్ కాపీయింగ్ అవకాశం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, సెల్ పాయింట్లు, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాల్సిందేనన్నారు.

సెల్‌ఫోన్లకు అనుమతి లేదు..

పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లను అనుమతించబోమని డీఈఓ స్పష్టం చేశారు. విద్యార్థులతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, మరో ఇతర అధికారి కూడా సెల్‌ఫోన్లు తీసుకురాకుండా ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్ష విధులకు కేటాయించిన అధికారులందరూ తప్పని సరిగా హాజరు కావాల్సిందేనన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి, చిత్రంలో ఓపెన్ స్కూల్ సంచాలకులు లాజరస్

విద్యార్థుల సౌకర్యార్థం కంట్రోల్ రూం..

పదో తరగతి విద్యార్థుల సౌకర్యార్థం కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో 9966761515,8074798808 నంబర్లతో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు డీఈఓ తెలిపారు. విద్యార్థులు, సిబ్బందికి పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి సమస్య తలెత్తినా కంట్రోల్ రూంకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

3 నుంచి ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు..

జిల్లావ్యాప్తంగా ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకూ ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ పరీక్షల సమన్వయకర్త, జిల్లా సంచాలకులు లాజరస్ తెలిపారు. జిల్లాలో 824 మంది పది, 1,605 మంది ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాయనుండగా, 'పది' పరీక్షలకు 5 , ఇంటర్ పరీక్షల నిర్వహణకు 9 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏ మొహం పెట్టుకుని పాదయాత్ర చేస్తున్నారు?

- నారా లోకేష్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: హామీలు ఇచ్చి నెరవేర్చకుండా మోసం చేసే నైజం టీడీపీ వారిదని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇంటింటికీ ఉద్యోగాలు ఇస్తామని యువతను, డ్వాక్రా రుణాలు, బంగారు రుణాలు మాఫీ చేస్తామని అక్కచెల్లెమ్మలను, వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తానని రైతులను మోసం చేసి.. మళ్లీ ఏ మొహం పెట్టుకుని టీడీపీ నేత నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారంటూ ప్రశ్నించారు. రాప్తాడు సమీపంలో జాకీ కంపెనీకి కేటాయించిన స్థలంలో రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాలకు సంబంధించి 'వైఎస్సార్ ఆసరా' వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ 2016లో పరిశ్రమల శాఖ మంత్రిగా నారా లోకేష్ ఉన్నప్పుడు పరిటాల సునీత 'జాకీ' పరిశ్రమ కోసం రూ.140 కోట్లు విలువ చేసే 28 ఎకరాల భూమిని చంద్రబాబు, లోకేష్ బినామీ సంస్థ ఫేజ్ ఇండస్ట్రీకి రూ.3 కోట్లకే కట్టబెట్టారన్నారు. 2018 నాటికి ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి చేయలేదన్నారు. వారి చేతగానితనంతోనే జాకీ కంపెనీ ఏర్పాటు కాకుండా పోయిందన్నారు. ఈ విషయాలపై ఆనాడే 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైందన్నారు. ఆనాడు సీఎంగా చంద్రబాబు, మంత్రులుగా లోకేష్, పరిటాల సునీత ఉన్నారని గుర్తు చేశారు. వీరి ఆధీనంలోనే ఉన్న సదరు భూమిని తమకు అప్పగిస్తే ఉచితంగా ఫ్యాక్టరీ నిర్మించి, ఆరు వేలమంది మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. అలాగే దేవరకొండ, తోపుదుర్తి రిజర్వాయర్లను పూర్తి చేసి రైతులకు కానుకగా ఇస్తామన్నారు.

నిర్లక్ష్యం ఇలా అయితే ఎలా?

- 2018 నుంచి వరుసగా మూడేళ్లు ఏపీ లాసెట్ నిర్వహణ
- లాసెట్ కన్వీనర్‌గా ఎస్కేయూ ప్రొఫెసర్ జ్యోతి విజయకుమార్
- 2018, 2019లో రూ.1.50 కోట్లు అడ్వాన్స్‌గా చెల్లింపు
- ఇప్పటిదాకా బిల్లులు సమర్పించని వైనం
- విచారణ కోసం ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కమిటీ

అనంతపురం: ఏపీ లాసెట్ నిర్వహించిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) పరువు ప్రతిష్టలకు మచ్చతెచ్చేలా అధికారులు వ్యవహరిస్తున్నారు. లాసెట్ కన్వీనర్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ జ్యోతి విజయ్‌కుమార్‌ను విచారణ చేసేందుకు ఉన్నత విద్యామండలి ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ మేరకు గత వారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలోనే ఉన్నత విద్యామండలి అధికారులు స్పష్టం చేశారు. కమిటీలో సభ్యులుగా ఎవరిని నియమిస్తారనే అంశంపై త్వరలోనే అధికారిక ఉత్తర్వులు రానున్నాయి. 2018, 2019, 2020 ఏపీ లాసెట్ బాధ్యతను ఎస్కేయూ నిర్వర్తించింది. 2018, 2019లో ఏపీ లాసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ జ్యోతి విజయకుమార్ వ్యవహరించారు. సెట్ నిర్వహణకు 2018లో రూ.85 లక్షలు, 2019లో రూ.65 లక్షలు మొత్తం రూ.1.50 కోట్లు అడ్వాన్స్ రూపంలో కన్వీనర్‌కు ఉన్నత విద్యామండలి చెల్లించింది. లాసెట్ నిర్వహణ, ప్రశ్నపత్రాల రూపకల్పన, ప్రింటింగ్, పరీక్ష కేంద్రాల నిర్వహణ, ఇన్విజిలేటర్ల రెమ్యునరేషన్‌కు చెల్లించిన బిల్లులను ఆడిటింగ్ చేసి ఉన్నత విద్యామండలికి అందజేయాలి. ఈ ప్రక్రియ అనంతరం ఏదైనా డబ్బు మిగిలితే ఆ సొమ్మును ఉన్నత విద్యామండలికి వెనక్కి చెల్లించాలి. అయితే ఇప్పటిదాకా బిల్లులు సమర్పించలేదు. ఇప్పటికే ప్రొఫెసర్ జ్యోతి విజయ్‌కుమార్‌కు మూడు దఫాలుగా వర్సిటీ అధికారులు మెమోలు జారీ చేశారు. అయినా బిల్లుల సమర్పణలో ప్రొఫెసర్ అంతులేని నిర్లక్ష్యం కనబరుస్తుండడం పలు విమర్శలు దారితీస్తోంది. ఈ క్రమంలో ఉన్నత విద్యామండలి కమిటీ నేరుగా ప్రొఫెసర్ జ్యోతి విజయ్‌కుమార్‌ను విచారించి బిల్లులకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా నివేదికను ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు సమర్పించనుంది.









క్లుప్తంగా

గ్యాస్ లీకై ఇల్లు దగ్ధం

- రూ.2.50 లక్షల ఆస్తి నష్టం



ఇంటిలో కాలిబూడిదైన సామగ్రి

బత్తలపల్లి: ఇంటిలో వంట చేసేందుకు ఉపయోగించే గ్యాస్ పైపు లీకై మంటలు వ్యాపించడంతో ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2.50 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు వాపోయారు. బాధితుల వివరాలమేరకు.. బత్తలపల్లికి చెందిన షేక్ ఖాశీంవలి బత్తలపల్లి కూడలిలో టీ స్టాల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద నుంచి టీ స్టాల్‌కు చేరుకున్నారు. అతని భార్య చైతున్‌బీ ఇంట్లో నుంచి బయటకు వచ్చి వంట సామగ్రి పాత్రలను శుభ్రం చేస్తోంది. ఇంతలో గ్యాస్ లీకై మంటలు ఇంటిని వ్యాపించాయి. స్థానికులు, చుట్టుపక్కల వారు సహాయం అందించి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. దాదాపు రూ.2.50 లక్షలు నష్టం వాటిల్లిందని షేక్ ఖాశీంవలి వాపోయారు. మంటలు వ్యాపించిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. లేనిపక్షంలో ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం సంభవించేదని స్థానికులు తెలిపారు. కట్టుబట్టలతో బయటపడ్డ తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి చేసింది. బత్తలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారి హఠాన్మరణం



మాహిర్ (ఫైల్)

కొత్తచెరువు: అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారి హఠాన్మరణం చెందిన సంఘటన కొత్తచెరువులో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాలమేరకు... కొత్తచెరువులోని మేదరవీధిలో నివాసముంటున్న ఆరీఫ్, ఫిర్దోస్ దంపతుల కుమారుడు మాహిర్ (4) శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో కిందపడిపోయి అచేతనంగా మారాడు. హుటాహుటిన బాలుడిని పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గుండెపోటు కారణమై ఉంటుందని వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు చెప్పారు.


యువకుడి ఆత్మహత్య

నార్పల: మండల కేంద్రంలోని గూగూడు రోడ్డు కాలనీలో నివాసం ఉంటున్న సుబహాన్ (35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలమేరకు... సుబహాన్ గుజిరీ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారని, వ్యాపారంలో భాగంగా పలువురితో అప్పులు చేశారని తెలిపారు. వ్యాపారంలో లాభాలు రాకపోడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలీక నిత్యం ఆవేదన చెందేవారన్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం తన గుజిరీ షాపులో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు.


అజరామరం.. రత్నగిరి వైభవం

1900 ఏళ్ల చరిత్ర.. చూడముచ్చటైన కోట... నాటి వైభవాన్ని చాటేలా దర్శనమిచ్చే అద్భుత కట్టడాలు... ఆహ్లాదకరమైన వాతావరణం... ఇవన్నీ మేళవించిన ప్రాంతం రత్నగిరి. ఇక్కడ వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి కోరిన కోర్కెలు తీర్చేదైవంగా పూజలందుకుంటున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం.

- నేటికీ చెక్కు చెదరని కోటలు, పురాతన కట్టడాలు
- రేపటి నుంచి కొల్హాపురి మహాలక్ష్మి బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



రత్నగిరి కొండ



చెక్కు చెదరని కళ్యాణి బావి

రొళ్ల: చారిత్రాత్మక ప్రదేశమైన రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి నాగేంద్రప్రసాద్‌రావు, రాజవంశీకుడు రంగప్పరాజు (దొర), గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవాలిలా...

ప్రతి ఏడాదీ చైత్రమాసంలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే ఏప్రిల్ 2న (ఆదివారం) జలధి ఉత్సవం, కలశ స్థాపన, 3న బ్రహ్మరథోత్సవం, ధూళోత్సవం, 4న జలధి, కలశ ఉత్సవం, గంగా పూజ, 5 నుంచి 8వ తేది వరకు జ్యోతుల ఉత్సవం, 9న పుష్పాలంకారణ, పోతుల రాజుచే విశేష పూజ, 10న పోతులరాజు భండార కార్యక్రమం నిర్వహించనున్నారు.

రవాణాకు ఏర్పాట్లు..

బ్రహ్మోత్సవాలకు హాజరు కానున్న భక్తులకు మడకశిర ఆర్టీసీ డిపో నుంచే కాకుండ సమీపంలోని కర్ణాటక ప్రాంతం మధుగిరి, శిరా, పావగడ డిపోల నుంచి కూడా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు.

కోరిన కోర్కెలు తీర్చే దైవం..



కొల్హాపురి మహాలక్ష్మీదేవి

కోరిన కోర్కెలు తీర్చే దైవంగా కొల్హాపురి మహాలక్ష్మీదేవి పూజలు అందుకుంటున్నారు. ఆలయ సమీపంలోని పాలబావిలో గంగా పూజ చేస్తే సంతానం లేనివారికి సంతాన భాగ్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వ్యాధులు నయం అవుతాయని భక్తుల నమ్మకం. ప్రతి మంగళ, శుక్రవారాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తుంటారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని అనే ప్రాంతాల నుంచి ఇక్కడికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటుంటారు.

చెక్కు చెదరని కట్టడాలు..

రత్నగిరికి 1900 ఏళ్ల చరిత్ర ఉంది. రత్నగిరి కర్ణాటక ప్రాంతం తుమకూరు జిల్లాకు సరిహద్దుగా ఉంది. రత్నగిరి సంస్థానాన్ని ఎక్కువగా పాలేగాళ్లు పరిపాలించారు. వారి తర్వాత శ్రీ కృష్ణదేవరాయులు ఆధీనంలో ఉండేది. రాజులు, రాజ్యాలు పోయినా వారు నిర్మించిన కోటలు, చంద్రశాల, అంత:పురం, గజశాలలు, రాతి ఏనుగులు, బురుజులు, కళ్యాణి బావులు, మంటపాలు, పురాత కట్టడాలు, ఊరి చుట్టు కోట, కొండ పై ఎత్తైన బురుజు, బండపై చెక్కిన మెట్లెలు లాంటివి చెక్కు చదరకుండా ఉన్నాయి. ఇక్కడున్న ఐదారు బావుల్లో ఎంతటి కరువులోనైనా కూడా ఎండి పోకపోవడం విశేషం.

చుట్టూ ఏడు కోటలు..

రత్నగిరి కొండను చేరుకొనేందుకు చుట్టు ఏడు కోటల్లో మొదటిదైన ఇంద్ర సేనకోట ముఖద్వారం ఆకర్షణీయంగా ఉంది. రెండో కోటను దాటితే పురాతన సరస్సులు, మంటపాలు కనిపిస్తాయి. మూడో ద్వారం దాటిన తరువాత ఎత్తైన బండపై మెట్లెలు నిర్మించారు. నాలుగో కోట ద్వారం వద్ద ఆంజనేయ స్వామి ఆలయం ఉంది. కొండ శిఖరంపై గోడల పక్కన గంట ఆకారంలో నెయ్యి (నేతి) దోణి నిర్మించారు. ఈ దోణిలో అప్పటి రాజులు నేతిని సేకరించి పదిల పరిచేవారని చరిత్ర చెబుతోంది.

సరస్సులో సంపద ?

బ్రిటీష్ పాలకుల కన్ను రత్నగిరి సంస్థానంపై పడినప్పుడు అప్పటి రాజులు సంపదను కాపాడుకునేందుకు ఇక్కడున్న సరస్సులో సంపదను పారేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అక్కడక్కడా కనిపించే జైన దేవాలయాను బట్టి చూస్తే రత్నగిరి ప్రాంతాల్లో జైనమతం కూడా వెరసిల్లినట్లు తెలుస్తోంది.

4న జరగాల్సిన పీజీ పరీక్ష 19కి వాయిదా

అనంతపురం: గ్రూప్–4 మెయిన్ పరీక్ష ఉన్నందున శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నాలుగో తేదీన జరగాల్సిన పీజీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షను 19వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పరీక్షలకు 148 మంది గైర్హాజరు

ప్రశాంతి నిలయం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 22 పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ బ్రిడ్జి కోర్సు, ఒకేషనల్ పరీక్షలకు సంబంధించి 148 మంది గైర్హాజరయ్యారు. బ్రిడ్జికోర్సుకు సంబంధించి లాజిక్, గణితం –1 పరీక్షలు నిర్వహించగా, 44 మందికి గాను 15 మందే హాజరకాగా, 29 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించిన పరీక్షకు 1,815 మందికి గాను 1,696 మంది మాత్రమే హాజరయ్యారు. 119 మంది గైర్హాజరయ్యారు.

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి: మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంజేపీ కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గురుకుల పాఠశాలలలో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందన్నారు. దరఖాస్తుదారులు http// mjpapbcwreis. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లోకేష్‌కు చీపురు దెబ్బలు ఖాయం

- సీఎంను విమర్శిస్తే సీమ దాటేలోపు జనమే తంతారు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: కుల, మతాలకు అతీతంగా రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని విమర్శిస్తున్న లోకేష్‌ను జనమే చీపుర్లతో కొట్టడం ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా తెలుగు తమ్ముళ్లు గతంలో జగనన్న 'కియా' కార్ల పరిశ్రమ గురించి మాట్లాడిన వీడియోను కట్ చేసి తమకు అనుకూలంగా మార్చుకుని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారన్నారు. వాస్తవానికి జగనన్న 'రైతు భరోసా' యాత్ర చేపట్టినపుడు దుద్దేబండ, గొల్లపల్లి, గొందిపల్లి, వీజీ పాళ్యం రైతులు తమ భూములను పరిశ్రమల కోసం తీసుకోరాదని, గొల్లపల్లి నుంచి 10 వేల ఎకరాలకు నీరందిస్తే తాము బంగారు పంటలు పండించుకుని సంతోషంగా ఉంటామని విన్నవించారన్నారు. అందువల్ల 'కియా' కార్ల పరిశ్రమను కొండంపల్లి సమీపంలోని దేవదాయ భూమిలో ఏర్పాటు చేయాలని కోరారని శంకరనారాయణ వివరించారు. రైతుల బాధ విన్న జగన్‌మోహన్‌రెడ్డి... న్యాయం చేస్తామని చెప్పారే కానీ, పరిశ్రమను అడ్డుకుంటామని చెప్పలేదన్నారు. మంచి చేయాలనే ఉద్దేశంతోనే ఆనాడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల పక్షాన మాట్లాడారని, ఆ వీడియోను కట్ చేస్తూ తమకు అనుకూలంగా మార్చుకుని లోకేష్ సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉన్న విషయం కూడా రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. 'కియా' ప్రాంతంలో ఎకరం రూ.కోటి పలికే భూమిని అప్పటి టీడీపీ ప్రభుత్వం కేవలం రూ. 9 లక్షలతో బలవంతంగా లాక్కుందన్నారు. ఈ నేపథ్యంలో మక్కాజిపల్లి తండాకు చెందిన బాలూనాయక్ అనే రైతు ఆవేదనతో ఆర్డీఓ కార్యాలయంలోనే హఠాన్మరణం చెందిన విషయాన్ని శంకరనారాయణ గుర్తు చేశారు. 'కియా' ఏర్పాటులోనూ చంద్రబాబు లోకేష్‌ల పాత్ర ఏమీ లేదన్నారు. నాడు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటంతోనే ప్రారంభోత్సవంలో పాల్గొనే అవకాశం చంద్రబాబుకు వచ్చిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశ్రమలకు ఎపుడూ అనుకూలమేనని, ఆయన మాటలను వక్రీకరించి విమర్శలకు దిగితే రాయలసీమ దాటేలోపు ప్రజలే పొరకలు, చాట్లతో కొడుతారన్న విషయం లోకేష్ గుర్తుంచుకోవాలన్నారు.

అదో సెల్ఫీల యాత్ర..

'యువగళం' పేరుతో లోకేష్ చేస్తున్నది సెల్ఫీల యాత్ర అని శంకరనారాయణ అన్నారు. అందుకే ఎవరు రోడ్డు పక్కన వెళ్తున్నా వారితో సెల్ఫీలు దిగుతూ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఏకంగా లోకేష్‌తో సెల్ఫీలు తీసుకునే వారు ఉంటే ఫలానా సమయానికి రావాలని బీకే పార్థసారథి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయడం చూసి ఆ పార్టీ నేతలే నవ్వుకుంటున్నారన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు చేశారని, ఈ క్రమంలోనే జిల్లాలో 'నాసిన్' సంస్థ ఏర్పాటు చేశారన్నారు. అదేదో తామే ఆ సంస్థను ఇక్కడ ఏర్పాటు చేయించినట్లు లోకేష్ 'నాసిన్' వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకోవడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారన్నారు.

చర్చకు సిద్ధంగా ఉండండి..

పెనుకొండలో జరుగుతున్న అభివృద్ధిపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తానని, దీనిపై బీకే, సవితమ్మలు చర్చకు సిద్ధంగా ఉండాలని శంకరనారాయణ అన్నారు. ఊసరవెల్లి సవితమ్మ ప్రచారమంతా గిమ్మిక్కేనన్నారు. ఆమె దొంగ వ్యాపారాలు... ఆమెపై ఉన్న కేసులన్నీ జనానికి తెలుసన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగలూరుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, ఎంపీపీ చంద్రశేఖర్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కొండలరాయుడు, జయశంకరరెడ్డి, వెంకటరామిరెడ్డి, మారుతి, కౌన్సిలర్ రామాంజనేయులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌కు రాజకీయ అవగాహన లేదు

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు లోకేశ్‌కు రాజకీయాలపై ఎలాంటి అవగాహన లేదని ఎమ్మెల్యే తిప్పేస్వామి విమర్శించారు. అవగాహన లేక తప్పుడు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగల అభివృద్ధిపై మాట్లాడే హక్కు లోకేష్‌తో పాటు టీడీపీ నాయకులకు లేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుంచిటి వక్కలిగల అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. 2008లో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగలను బీసీలుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. అలాగే వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేకంగా కుంచిటి వక్కలిగలకు కార్పొరేషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. మడకశిర నియోజకవర్గానికే చైర్‌పర్సన్, 10 డైరెక్టర్ పోస్టులు కూడా ఇచ్చారన్నారు. ఈ విషయాలను తెలుసుకోకుండా అమాయక చక్రవర్తిలా లోకేష్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

సింహ వాహనంపై రంగనాథుడు



సింహవాహనముపై ఆలూరు కోన రంగనాథస్వామి

తాడిపత్రి: ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి స్వామివారు భక్తులకు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. గురువారం బ్రహ్మోత్సవాలు ప్రారంభంకాగా రాత్రి స్వామి వారికి విష్వక్సేరాధన, వాసుదేవ పుణ్యాహవాచనము, అంకురార్పణ, ధ్వజారోహణము, కలశ స్థాపన, దీక్షా హోమం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. రెండో రోజైన శుక్రవారం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలూరు గ్రామంలో నిర్వహించిన గ్రామోత్సవంలో ఆలూరు కోన రంగనాథస్వామి భక్తులకు సింహవాహనంపై దర్శనమిచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి వి.సుబ్రమణ్యం, ఆలయ చైర్మన్ రామచంద్రారెడ్డి, దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు.

లారీని ఢీకొన్న ఆటో

- ఐదుగురు కూలీలకు తీవ్రగాయాలు



జాతీయ రహదారిపై లారీని వెనుక వైపు నుంచి ఢీకొన్న ఆటో

ఉరవకొండ: మండల పరిధిలోని చిన్నమూష్టూరు సమీపంలోని 42వ జాతీయ రహదారిపై ఆగివున్న లారీని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఐదుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాలమేరకు... ఉరవకొండ పట్టణంలోని పాతపేటకు చెందిన 15 మంది కూలీలు శుక్రవారం ఆమిద్యాలలో మిర్చి పంట తొలగించేందుకు వెళ్లారు. తిరిగి వారంతా ఉరవకొండకు ఆటోలో బయలుదేరారు. అయితే లారీ .. ఆటోను ఓవర్‌టేక్ చేయబోయింది. లారీకి ఎదురుగా కారు రావడంతో లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. ఈ సమయంలోనే ఆటో వేగంగా వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో పాతపేటకు చెందిన నాగిరెడ్డి, ఎర్రమ్మ, వన్నూరప్ప, సుభాషిణి, పద్మావతిలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని 108 వాహనంలో ఉరవకొండ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. ఒకరి మృతి

బొమ్మనహాళ్/బెళుగుప్ప: మండల పరిధిలోని గుండ్లపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మహానంద (50) అనే వ్యక్తి మృతి చెందారు. ఎస్‌ఐ రామకృష్ణయ్య వివరాల మేరకు ... శెట్టూరు మండలం యాటకల్లుకు చెందిన మహానంద, వెంకటరమణ రాయదుర్గం సమీపంలోని బానేపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. అయితే గుండ్లపల్లి జాతీయ రహదారిపై నక్కలపల్లికి చెందిన గంగాధర్ ద్విచక్ర వాహనంలో అతి వేగంగా వచ్చి ముందువెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మహానంద తీవ్రగాయాలయ్యాయి. గంగాధర్, వెంకటరమణలకు రక్తగాయాలయ్యాయి. హుటాహుటిన మహానందను 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య సరస్వతి, కుమారులు రాజశేఖర్, ప్రదీప్ ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

నకిలీ నాణేల ముఠా అరెస్టు

పెద్దవడుగూరు: నకిలీ బంగారు నాణేలను విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న ముఠా సభ్యుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాడిపత్రి రూరల్ సీఐ చిన్నపెద్దయ్య, ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. కూడేరు మండలం ఎమ్ఎమ్ పల్లికి చెందిన గుజ్జల మురళీ, సాకే మల్లికార్జున సికింద్రాబాద్ చెందిన శివగాయత్రీ అలియాస్ దీపికతో ఫోన్ ద్వారా పరిచయం పెంచుకున్నారు. కొన్ని రోజుల తరువాత తమ పాత ఇళ్లు పడగొట్టే సమయంలో పాత బంగారు నాణేలు బయట పడ్డాయి వాటిని ఎలా విక్రయించుకోవాలో తెలిడం లేదని చెప్పారు. మీకు తక్కువ ధరకే ఇస్తామని నమ్మించారు. కాశేపల్లి టోల్‌గేట్ సమీపంలోని గేట్స్ కళాశాల వద్దకు డబ్బుతో రావాలని చెప్పడంతో వారు అక్కడికి వచ్చారు. డీల్ కుదుర్చుకున్న దొంగలు ఆమెకు 200 నకిలీ బంగారు నాణేలు ఇచ్చారు. డబ్బు ఇవ్వాలని కత్తితో బెదిరించి డబ్బుతో అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు పెద్దవడుగూరు పోలీసులకు గత నెల 25న ఫిర్యాదు చేయగా రంగంలోకి దిగిన పోలీసులు దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచారు. శుక్రవారం మిడుతూరు బస్టాండ్ వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు లో మరో ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణకుమారి



ప్రొఫెసర్ కృష్ణకుమారికి నియామక పత్రం అందజేస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కృష్ణకుమారి, పాలిమర్ సైన్స్ విభాగాధిపతిగా డాక్టర్ కే. రామగోపాల్, రూసా కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ సి. నాగరాజును నియమించారు. ఈ మూడు పదవుల్లోనూ ఉన్న ప్రొఫెసర్ జీవన్‌కుమార్ శుక్రవారం పదవీ విరమణ చేయడంతో వాటిని భర్తీ చేశారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

71 మందికి ఉద్యోగ అవకాశాలు



ఓటీపీఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్‌తో ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులు

అనంతపురం: ఓటీపీఆర్ఐ–జేఎన్‌టీయూ అనంతపురంలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 71 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు డైరెక్టర్ బి. దుర్గాప్రసాద్ తెలిపారు. ' ఇండియన్ హెల్త్ కేర్ బీపీఓ ' చెన్నై కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో మొత్తం 80 మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 71 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలు పొందిన వారు మెడికల్ కోడింగ్, మెడికల్ బిల్లింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులను డైరెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్ , క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కోఆర్డినేటర్స్ మహేశ్, డాక్టర్ ఈ. పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

NURSING ADMISSIONS

■ ఓప్లీ గర్ల్స్ కాలేజ్‌లో, Govt. సీట్స్, GNM (నర్సింగ్) నందు ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజ్‌లోనే హాస్టల్. అర్హత : ఇంటర్ ఏ గ్రూప్ అయినా OK, సంప్ర : జి. మురళీ, 9030661651. [A.734351]

ఉచిత శిక్షణ

■ గ్రామీణ నిరుద్యోగ స్త్రీలకు (Womens) శుభవార్త! ఉచిత శిక్షణ, ఉచిత హాస్టల్ & ఉద్యోగాలు కూడా. సంప్ర॥ 95779 81999, 95779 83999, 94411 64602. NICETS, ATP. [A-2427]

EAMCET / NEET

■ అతి తక్కువ ఫీజుతో, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఎంసెట్ & నీట్ షార్ట్‌టర్మ్ కోచింగ్ ఇవ్వబడును. హాస్టల్ కలదు. అడ్రస్: S.V. కోచింగ్ సెంటర్, PRK కాలేజ్, GR ఫంక్షన్ హాల్ ఎదురుగా, 3వ రోడ్డు, ATP. 8919092368. [A.734354]

EDUCATION

■ Hotel Management Courses at Mariya Nagar on. NH44. Cheenakothapalli mandalam offered by Guinness World Record Holder Ph : 9398164950 [H-781554]

REAL ESTATE

LAND FOR SALE

■ మద్దూర్ గ్రామం, పాములపాడు మండలం, కర్నూలు జిల్లాలో నీటి పారుదల గల వ్యవసాయ భూమి 20.5 ఎకరాలు అమ్మకానికి కలదు. సంప్ర : 82175 81518 [L-795154]

WANTED

■ మా S.R సంస్థ నందు పనిచేయుటకు 10th, Inter, Diploma (P/F) అయి 25 సం॥లోపు యువతి యువకులు కావలెను. సంపాదన నెలకు 12000/- to 25000/- + రూం ఫ్రీ. సెల్: 7989389001. [WA-6933]

■ ప్రముఖ అగ్రో సంస్థ నందు ఇంటి వద్దనే ఉండి జాబ్ చేయుటకు స్త్రీ/పు కావలెను. పార్ట్ టైం స్త్రీలకు ప్రత్యేకంగా... జీతం : 18,000/– జెన్యూన్ జాబ్. మొబైల్ ఫ్రీ : 73869 73420 [G-6629]

■ JOBS : లేడీ టెలికాలర్స్ కావలెను. కంప్యూటర్ నాలెడ్జ్ కల్గిన వారు మాత్రమే సంప్రదించండి. అడ్రస్: శివసాయి హోండా షోరూమ్, R.F. రోడ్డు, ATP. సెల్: 9885490900. [A-734353]

■ ఉద్యోగాలు: S.R. నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F), Age: 18 to 28 నో ఫీజ్, Cell: 9177342337. [WA-6927]

■ మీ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15000 నుంచి 20,000 వరకు జీతం.మరిన్ని వివరాలకై 9000408325 [G-795291]

■ Wanted Marketing Executives For Realestate Ltd Company Work In Hyderabad only 5 hours with accommodation. 12000/- Salary. Contact 7675869451 [HA-92803]

■ Wanted Teachers (CBSE), NEET & JEE Faculty, Sal: 12-15 Lakhs, Exp. Candidates, Send C.V. info@dheeranchinnamalaischool.ac.in, Dheeran Chinnamalai School & Academy, Krishnagiri (Dist),Tamilnadu, 9442882228. [T-1201063]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

→ అద్దెకు → అమ్మకం → రియల్ ఎస్టేట్ → ఫర్నీచర్స్ → ఆటోమొబైల్ → కంప్యూటర్స్ → సర్వీసెస్ → కావలెను

4 లైన్లు రూ. 270/-

అదనపు లైను రూ. 60/-

ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650

DHARMAVARAM : 9912220726, 9912220727

HINDUPUR : 9912220723, 9705346587

GUNTAKAL : 9010223701

TADIPATRI : 9912220722

MADAKASIRA : 9010200238

KADIRI : 9010593486

RAYADURG : 9010470185

■ శ్రీ విజయ ట్రాక్టర్ ఏజెన్సీ, ATP నందు పని చేయుటకు ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ అడ్వయిజర్స్ (B.Tech. / డిప్లొమా - మెకానికల్) కావలెను. 8374559867, 9441190089. [A-734356]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795290]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీతం: 16k - 18k ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899 [HA-1164]

■ మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లలో అనుభవం ఉన్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. (ప్రాఫిట్‌లో షేర్ ఇవ్వబడును). Mega Group Man Power & Security (AP & TS). Contact : 70326 10569, 70931 25169. [NA-5476]

■ Required Principal, Full Time Maths, Physics, Chemistry, Commerce, Economics, Civics, English, Botany, Zoology, Sanskrit Lecturers, PRO's & Wardens. # Sri Masters Junior Colleges, Anantapur. Ph: 9440774498. [A-734357]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.